


# ఇష్టము

**మూలవాక్యము:-**

**కీర్త 135:6** ఆకాశమందును,భూమియందును,సముద్రములయందును, మహా సముద్రములన్నిటియందును ఆయన తన కిష్టమైనదంతయు జరిగించువాడు.

ఇష్టము అన్న మాట తరచు మనము ఉపయోగిస్తుంటాము. ఏదైన తినేటప్పుడు, తాగేటప్పుడు ఏదైనా వస్తువు కొనేటప్పుడు ఇష్టమైనవే తింటాము, తాగుతాము, కొంటాము లేదా ఇష్టము లేదు అని వద్దు అనుకుంటాం. నరునిగా మన ఇష్టానికి అంత ప్రాధాన్యత ఇస్తున్నప్పుడు మనలని ఇష్టపడి చేసిన దేవునికి ప్రాధాన్యత ఇస్తున్నామా? అసలు దేవునికి ఏది ఇష్టము ఎవరు ఇష్టము అన్న ప్రశ్నలు ఎప్పుడైన మనము వేసుకున్నామా? మనము ఆయన ఇష్టము చొప్పున నడుచుకొంటున్నామా లేదా అని ఆలోచించామా? మరి లేఖనాలు దేవుని ఇష్టమును గూర్చి ఏమి చెప్తున్నాయో గమనిద్దాం.

**దేవునికి ఏది ఇష్టము? ఎవరిని ఇష్టపడుతారు?**

- **యథార్థవంతులను:-**

**1దిన 29:17** నా దేవా, నీవు హృదయ పరిశోధన చేయుచు యథార్థవంతుల యందు ఇష్టపడుచున్నావని నేనెరుగుదును; నేనైతే యథార్థ హృదయముగలవాడనై యివియన్నియు మనఃపూర్వకముగా ఇచ్చియున్నాను. ఇప్పుడు ఇక్కడ నుండు నీ జనులును నీకు మనఃపూర్వకముగా ఇచ్చుట చూచి సంతోషించుచున్నాను.

- **కీర్త 16:3** నేనీలాగందును భూమి మీదనున్న భక్తులే శ్రేష్ఠులు; వారు కేవలము నాకు ఇష్టులు.

  **ఉదా:- కీర్త 84:10** నీ ఆవరణములో ఒక దినము గడుపుట వెయ్యి దినముల కంటె శ్రేష్ఠము. భక్తిహీనుల గుడారములలో నివసించుట కంటె నా దేవుని మందిర ద్వారము నొద్ద నుండుట నాకిష్టము.

భక్తుడైన దావీదు చెప్తున్నాడు భక్తిహీనుల గుడారములో నివసించుట కంటె నా దేవుని మందిర ద్వారము నొద్ద నుండుట నాకిష్టము అని నిజముగా దేవుని యెడల భయము, భక్తి కలవారు దేవునిని, దేవుని మందిరాన్ని మరియు దేవుని మందిర ద్వారాన్ని ఆశ్రయిస్తారు. అందుకే దేవుడు దావీదుని నా ఇష్టానుసారుడు అని ప్రస్తావించడము జరిగింది. (అ.కా 13:22)

- **నీతి న్యాయములు అనుసరించి నడుచువారు:-**

**సామె 21:3** నీతి న్యాయముల ననుసరించి నడుచుకొనుట బలుల నర్పించుట కంటె యెహోవాకు ఇష్టము.

- **సత్య వర్తనులు :-**

సామె 12:22 అబద్ధమాడు పెదవులు యెహోవాకు హేయములు. సత్యవర్తనులు ఆయన కిష్టులు.

- **క్రీస్తునకు దాసుడు:-**

రోమా 14:17,18 దేవుని రాజ్యము భోజనమును పానమును కాదు గాని, నీతియు సమాధానమును పరిశుద్ధాత్మయందలి ఆనందమునైయున్నది. ఈ విషయమందు క్రీస్తునకు దాసుడైన వాడు దేవునికి ఇష్టుడును మనుష్యుల దృష్టికి యోగ్యుడునై యున్నాడు.

- **జ్ఞాన వివేకము కలిగిన కాపరులు:-**

యిర్మీ 3:15 నాకిష్టమైన కాపరులను మీకు నియమింతును, వారు జ్ఞానముతోను, వివేకముతోను మిమ్ము నేలుదురు.

- **పొలములో పనిచేయుట:-**

మత్త 21:30 అతడు రెండవ వాని యొద్దకు వచ్చి ఆ ప్రకారమే చెప్పగా వాడు అయ్యా, పోదుననెను గాని పోలేదు. ఈ యిద్దరిలో ఎవడు తండ్రి యిష్ట ప్రకారము చేసిన వాడని వారి నడిగెను.

పై లేఖనాన్ని గమనిస్తే ఒక వ్యక్తి తన తండ్రి పని చెప్పిన వాడు పోను అని చెప్పి మనస్సు మార్చుకొని వెళ్లాడు. కాని రెండవ వాడు వెళ్తాను అని చెప్పి వెళ్లడు. మొదటి వాడు నోటితో ఒప్పుకొనక పోయిన క్రియలలో చూపించాడు. కాని రెండవ వాడు నోటితో ఒప్పుకొన్నాడు కాని క్రియలలో చూపించలేకపోయాడు.

**దేవునికి ఏమి ఇష్టము:-**

- **న్యాయము చేయుట:-**

యెష 61:8 ఏలయనగా న్యాయము చేయుట యెహోవానగు నాకిష్టము ఒకడు అన్యాయముగా ఒకని సొత్తు పట్టుకొనుట నాకసహ్యము. సత్యమును బట్టి వారి క్రియా ఫలమును వారికిచ్చుచు వారితో నిత్యనిబంధన చేయుదును.

- **ఇశ్రాయేలీయులను(ప్రార్థనలో పోరాడు వారిని) తన జనముగా చేసుకోవడము ఇష్టము:-**

1సమూ 12:22 యెహోవా మిమ్మును తనకు జనముగా చేసికొనుటకు ఇష్టము గలిగియున్నాడు; తన ఘనమైన నామము నిమిత్తము తన జనులను ఆయన విడనాడడు.

- **దేవునికి తన ప్రియమైన కుమారుని నలుగగొట్టుటకు ఇష్టము:-**

యెష 53:10 అతని నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమాయెను. ఆయన అతనికి వ్యాధి కలుగజేసెను. అతడు తన్ను తానే అపరాధపరిహారార్థబలి చేయగా అతని సంతానము చూచును. అతడు దీర్ఘాయుష్మంతుడగును, యెహోవా ఉద్దేశము అతని వలన సఫలపరుచును.

దేవుడు మనలను ఎంత ఇష్టపడ్డాడు అని వివరించటానికి ఈ ఒక్క లేఖనము చాలు. తన ఏకైక

కుమారుని కేవలము మన కోసము నలుగగొట్టుటకు అప్పగించినాడు. అంత త్యాగము చేసిన దేవునికి మనము ఇష్టులుగా ఉండలేమా? తండ్రి మన కోసం యేసు క్రీస్తు వారిని నలుగగొట్టుటకు అప్పగించునప్పుడు యేసు క్రీస్తు వారు ఏమి చేసినారో ఒకసారి చూద్దాం.

**మత్త 26:39** కొంత దూరము వెళ్లి సాగిలపడి నా తండ్రీ, సాధ్యమైతే ఈ గిన్నె నా యొద్ద నుండి తొలగిపోనిమ్ము, అయినను నా యిష్ట ప్రకారము కాదు నీ చిత్త ప్రకారమే కానిమ్మని ప్రార్థించెను.

యేసు క్రీస్తు వారు ఎటువంటి శ్రమలు గుండా వెళ్లబోతున్నారో ఆయనకు ముందే తెలుసు. అయినను తన ఇష్టము కన్నా తండ్రి ఇష్టానికి విలువనిచ్చి ప్రాణత్యాగము చేశారు.

యేసు క్రీస్తు వారు మనకు మాదిరి అన్న విషయాన్ని గుర్తు చేసుకుందాం. ఆయన ఎలాగు తండ్రి ఇష్టాన్ని నెరవేర్చినారో ఆలాగు మనము కూడా తండ్రి ఇష్టాన్ని నెరవేర్చి ఆయనకు ఇష్టులుగా మన జీవితాల్లో ముందుకు సాగిపోదాము. అలాంటి తీర్మానము తీసుకుందాం.

**తీర్మానము:-**

**యోహా 8:29** నన్ను పంపిన వాడు  నాకు తోడైయున్నాడు; ఆయన కిష్టమైన కార్యము నేనెల్లప్పుడును చేయుదును గనుక ఆయన నన్ను ఒంటరిగా విడిచిపెట్టడు.

**ముగింపు:-**

**కీర్త 41:11** నా శత్రువు నా మీద ఉల్లసింపకయుండుట చూడగా నేను ఆయనకు ఇష్టుడనని తెలియనాయెను.

దేవునికి ఏది ఇష్టమో ఆయన ఎవరిని ఇష్టపడతారో పై లేఖన భాగాలు మనకు తెలియజేశాయి. మనము దేవునికి ఇష్టమైనవారము అవునా? కాదా? అన్నది మనకు ఎలా తెలుస్తుంది అంటే మన శత్రువులు మనలను చూచి సంతోషించే అవకాశం వారికి దొరకదు. సరి కదా శత్రువుల యెదుట ఆయన మనకు భోజనము సిద్ధపరుస్తాడు. ఈ అనుభవం నువ్వు నేను కలిగియున్నట్లయితే మనము దేవునికి ఇష్టులమని అని అర్థం చేసుకోవాలి. కాబట్టి అలాగున దేవునికి ఇష్టులముగా జీవించు కృప దేవుడు మనకు అనుగ్రహించును గాక. ఆమేన్...